అరగంట నుంచి ఎదురుచూస్తున్నాను— అతను వారపత్రిక చదవటం పూర్తి చేస్తాడేమోనని. అతను చదవగానే నేను చదవాలి మరి. కాలేజి టైం అవడంతో అయిష్టంగానే లైబ్రేరీలో నుంచి బయటకు వచ్చాను. ఎందుకో ఇందాకట్నుంచీ ఎక్కిళ్ళు వస్తున్నాయి. ఆగటం లేదు. నాకు ఎక్కిళ్ళు వస్తే బలే ఇబ్బందిగా ఉంటుంది. వాచీ చూసుకున్నాను. క్లాసుకి ఇంకా పావుగంటే టైముంది. కాస్త వేగంగా నడిస్తే పది నిమిషాల్లో చేరుకోగలను. వేగంగా అడుగులేస్తున్నాను. షూ వేసుకోవడం వల్ల అరికాళ్ళకు ఉక్కగా ఉంది. ఎక్కిళ్ళు కూడా పెరిగాయి. అయినా నడక వేగం తగ్గించ లేదు.

"ఏయ్ ఆగు" ఎవరో పిలిచినట్లుంటే వెనక్కి తిరిగి చూశాను. "ఆగక్కడ నిన్నే" నా వెనుకనే నడుస్తున్న ముగ్గురు అమ్మాయిల్లో ఒకమ్మాయి అంది. నాకు భయమేసింది. మొదట్నుంచీ నాకు ఆడాళ్ళంటే భయమే. వాళ్ళు ముగ్గురూ నా దగ్గరకొచ్చి ఆగారు. ముగ్గురూ అందంగానే ఉన్నారు. నన్ను ఆగమన్న అమ్మాయి నా వైపు కోపంగా చూస్తోంది. భయమేసి కళ్ళు దించుకున్నాను. ఆ అమ్మాయి నా వైపు కోపంగా ఎందుకు చూస్తున్నదో నాకు అర్థం కావడం లేదు. నా ఎడమ కన్ను అదురుతోంది. నా మనసేదో కీడును శంకించింది. నాకు కంగారు ఎక్కువయింది. "రోగ్, అందగాడిననుకుంటున్నావా? కన్నుకొడుతున్నావ్?" ఆ అమ్మాయి కోపంగా అడిగింది. నా ప్రాణం దాదాపు పోయినట్లే అనిపించింది. "నేనేంటి? కన్ను కొట్టటమేంటి?"

"ఏ... ఏంటి" అన్నాను వణికిపోతూ.

"ఏంటేంట్రా రాస్కెల్"— వొంగొని కాలి చెప్పు తీయబోతూ అంది. నాకు కళ్ళు తిరిగిపోతున్నాయి. వళ్ళంతా చెమట అలుముకుంది. అప్రయత్నంగా ఎడమ చేయిని చెంపకి అడ్డం పెట్టుకున్నాను. అయితే ఆ అమ్మాయి చెప్పు తీయకుండా మిగతా ఇద్దరూ వారించారు. నాకు చాలా అవమానంగా ఉంది. గొంతు పెగల్చుకొని "నేనేం... చేశానండీ?" అన్నాను. "ఇడియట్" అంది మళ్ళీ. మాట్లాడకపోవటం మంచిదనుకొని మౌనంగా ఉన్నాను. "నడువ్, చెప్తా నీ పని" అంది. హమ్మయ్య అనుకొని మెల్లగా నడవటం ప్రారంభించాను. వాళ్ళు నాకు ప్రక్కగానే నడుస్తున్నారు. ఒకసారి తలెత్తి ఆ అమ్మాయి మొహం వైపు చూశాను. ఇంకా కోపంగానే చూస్తోంది. గభాల్న కళ్ళు దించుకుని నడవసాగాను. "కొంపతీసి పోలీస్ స్టేషన్‌కు కాదు కదా!" ఆ ఊహ రావడంతోనే భయం మళ్ళీ తారాస్థాయికి చేరింది.




"నువ్వు చదివేది శాతవాహన కాలేజీలో నేనా?" తలూపాను. "అయితే నడువ్" అంది. మిగతా ఇద్దరూ నవ్వుతున్నారు. ఎందుకు నవ్వుతున్నారో అర్థం కాలేదు. ఫైవ్ టౌన్ పోలీస్ స్టేషన్ కాలేజికి దగ్గర కూడా. ఆ సంగతి గుర్తుకు రాగానే భయం, హై బి.పి.లా మళ్ళీ పెరిగింది. అసలు నేనేం చేశానో నాకు తెలియడం లేదు. ఆ అమ్మాయి కన్నుకొట్టానంటుంది. "అమ్మో నాకంత ధైర్యమే!" అనుకున్నాను. ఒక వేళ పొరపాటున వాళ్ళ వైపు చూసి కళ్ళు ఆర్పానేమో? ఆ విషయమే వాళ్ళతో చెప్పి, ఒక్క 'సారీ'తో తప్పించుకుందామనుకున్నాను. అయితే వాళ్ళను చూస్తే నోరు పెగలటం లేదు.

మా ఫ్రెండ్స్ ఎవరైనా చూస్తే ఎంత అవమానం. నా ఆలోచనకు అంతరాయం కలిగిస్తూ— "ఆగు" అంది ఆ అమ్మాయి. ఉలిక్కిపడి ఆగాను. చుట్టూ చూశాను. మా కాలేజి దగ్గరి కిళ్ళీ కొట్టు దగ్గర ఆగి ఉన్నాము. వాళ్ళు కొట్టతనితో ఏదో చెప్పారు. అతను నాలుగు సోడాలు ఇచ్చాడు. "త్రాగు" అంది ఆ అమ్మాయి— ఒకటి నాకు అందిస్తూ. ఏం జరుగుతుందో నాకేమీ బోధపడటం లేదు. గటగటా త్రాగేశాను. "పాపం! ఎంత భయపడ్డాడే" అంది వారిలో ఇంకో అమ్మాయి. ఆ మాటకి మిగతా ఇద్దరు పెద్దగా నవ్వారు. వాళ్ళు నవ్వగానే ఎందుకో పరిస్థితి తేలికయినట్లు అన్పించింది నాకు. కానీ చాలా అవమానంగా ఉంది. నిమిషం క్రితం వరకూ నన్ను ఆజ్ఞాపించిన ఆ అమ్మాయి— "సారీ అండీ" అంది నావైపు చూస్తూ నవ్వి. ఏమీ బోధపడలేదు. అందుకే మౌనంగా ఉండిపోయాను. "నాకు ఎక్కిళ్ళంటే మహా చిరాకండీ. ఎక్కిళ్ళు వచ్చేవాళ్ళను భయపెడితే అవి పోతాయని మా అమ్మమ్మ చెప్పింది. అందుకే ఇందాక మీరు ఎక్కిళ్ళతో ఇబ్బంది పడుతుంటే చూడలేక ఇలా బెదిరించాను"— ఆ అమ్మాయి సంజాయిషీ చెప్తున్నట్లుగా నవ్వుతూ చెప్పింది. నా నోట్లోంచి మరో మాట రాలేదు. అవును నేను గమనించలేదు గానీ, ఎక్కిళ్ళు నిజంగానే ఆగిపోయాయి. అయితే ఎక్కిళ్ళు ఆగినందుకు సంతోషించాలో, వీళ్ళ చేత ఇలా అవమానింపబడినందుకు దుఃఖించాలో అర్థంకాలేదు. "మేము శారదా కాలేజండి.

నా పేరు రేఖ, ఇది లలితా, అది సుభద్ర. ముగ్గురం ఫైనల్ బి.ఎ.నే" అంది ఆ అమ్మాయి నా ఆలోచనకు అంతరాయం కలిగిస్తూ.

ఏడవలేక నవ్వాను.

"మరి మీరో?" అంది ఆ అమ్మాయి.

పేరు చెప్పి, "బి.కాం. ఫైనల్" అన్నాను.

"కలుస్తూండండి, వస్తామండీ" కదిలి పోయారు ఆ ముద్దుగుమ్మలు. నేనలా కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయాను.

— తుపాకుల. వై.